
హుస్సేన్ సాగర్ నాలాను పరిశీలిస్తున్న జోనల్‌కమిషనర్ రవికిరణ్, తదితరులు

నాలాల్లో పూడికతీత పనులకు చర్యలు

● జోనల్ కమిషనర్ రవికిరణ్

బర్కత్‌పుర, మే 31 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలోని నాలాల్లో యుద్ధ ప్రాతిపదికన పూడికతీత పనులు చేపట్టామని జోనల్ కమిషనర్ ఎస్ రవికిరణ్ తెలిపారు. రాబోయే వర్షా కాలంలో వర్షపు నీరు సాఫీగా వెళ్లడానికి పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. శుక్రవారం నియోజక వర్గం పరిధిలోని హుస్సేన్‌సాగర్ నాలా ఫీవర్ ఆస్పత్రి వద్ద ఉన్న సర్‌ప్లస్ నాలాను పరిశీలించారు. నాలాలో చేపట్టిన పూడికతీత పనులను పర్యవేక్షించారు. డీఎంసీ మారుతి దివాకర్, ఎఎంహెచ్‌ఓ హేమలత, డీఈ రఘు, ఏఈ విఘ్నేశ్వరి, ఎస్‌ఎఫ్ తిరుపతితో కలిసి పరిశీలించారు. జోనల్ కమిషనర్ మాట్లాడుతూ, నియోజక వర్గంలోని ప్రధానమైన నాలాల్లో పూడితకతీత పనులను త్వరితగతిన పూర్తి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు పడకుండా పూర్తి స్థాయిలో నాలాల్లో పూడిక తీస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణ దశాబ్ది వేడుకల్లో

ఉద్యమకారులను భాగస్వామ్యం చేయాలి

● జేఏసీ కన్వీనర్ గోపాల్‌రావు

బర్కత్‌పుర, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న తెలంగాణ దశాబ్ది వేడుకల్లో అసలైన ఉద్యమ కారులను గుర్తించి భాగస్వామ్యం చేయాలని 1969 తెలంగాణ ఉద్యమ విద్యార్థి నేతల జేఏసీ కన్వీనర్ ఎస్ గోపాల్‌రావు డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వం వస్తే ఉద్యమ కారులకు న్యాయం చేస్తామని గతంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని దానికికట్టుబడి ఉండి ఉద్యమ కారులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. శుక్రవారం కాచిగూడలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ పంపానని దానిలో ప్రస్తుతం బతికిఉన్న ఉద్యమ కారుల పేర్లనుకూడా పొందుపర్చానని ఆయన తెలిపారు. గాంధీభవన్‌కు ప్రొఫెసర్ కోదండరాం, ఎమ్మెల్యే వివేక్‌కు పంపామని ఆయన చెప్పారు.



విజేతలకు సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

పొగాకు రహిత సమాజాన్ని నిర్మించాలి

● డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్

కవాడిగూడ, మే 31 (ఆంధ్రజ్యోతి): పొగాకు రహిత సమాజ నిర్మాణం జరగాలని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్, లయన్ జి. కృష్ణవేణి అన్నారు. శుక్రవారం హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీకేర్, నవభారత లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ సందర్భంగా లోయర్ ట్యాంక్‌బండ్‌లోని గోషాల సమీపంలోని మోతీలాల్ నెహ్రూనగర్‌లో పొగాకు వల్ల నష్టాలపై విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యువత పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని దూమపానం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వారు అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కవిత, ఆయా విజయ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజేతలకు క్రికెట్ కిట్లు, షెటిల్‌బ్యాట్ మెంటన్లు, నాలెడ్జి పుస్తకాలను బహుమతులుగా అందజేశారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, మే 31 (ఆంధ్రజ్యోతి): రైలు పట్టాల వెంట నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని రైలు ఢీకొని మృతి చెందాడు. కాచిగూడరైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... ఫలక్‌నామా వట్టిపల్లి వద్ద నివాసం ఉంటున్న షేక్ రైస్(53) వంట పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతని నివాసం రైలు పట్టాల పక్కనే ఉంది, ప్రతి రోజు మాదిరిగానే గురువారం రాత్రి పట్టాల వెంట నడుచుకుంటూ ఇంటికి వెలుతుండగా వెనకనుంచి వేగంగావచ్చిన రైలు ఢీకొట్టింది, ఈప్రమాదంలో తీవ్రగాయాలతో అక్కడిక్కడే మృతిచెందారు. కేసు నమోదు చేసుకొని కాచిగూడ రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి మందలించిందని ఇంటినుంచి వెళ్లి పోయిన విద్యార్థిని


రమ్య

బర్కత్‌పుర, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రేమ వ్యవహారానికి దూరంగా ఉండాలని తల్లి మందలించడంతో డిగ్రీ విద్యార్థిని ఇంటినుంచి వెళ్లి పోయిన సంఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో శుక్రవారం జరిగింది. అడ్మిన్ ఎస్ఐ కె. సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. చప్పల్‌బజార్‌లో నివాసం ఉంటున్న ప్రతాప్ కుమార్తె రమ్య(23) డిగ్రీ చదువుతుంది. తిరుపతి అనే యువకుడిని ప్రేమిస్తుంది. ఈ విషయంలో తల్లికి తెలియడంతో కుమార్తెను మందలించింది, శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో రమ్య ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. కంగారు పడిన తల్లి దండ్రులు స్నేహితులు, బంధువులు, చుట్టు పక్కప్రాంతాల్లో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. తల్లి నిర్మలమ్మ కాచిగూడ పోలీస్ స్టేషనలో ఫిర్యాదుచేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టం తేవాలి

● ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

రాంనగర్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలలో ఫీజుల దందా నియంత్రణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని, వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోనే చట్టానికి రూపకల్పన చేయాలని ఎమ్మెల్సీ ఎ.నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్ఐ) ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం చట్టాన్ని అమలు చేసి విద్యారంగాన్ని ప్రక్షాళన చేయాలని, ఫీజులను నియంత్రణ చేయాలి అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ హాజరై ప్రసంగించారు. నగరంతో పాటు రాష్ట్రంలో చాలా చోట్ల అనుమతులు లేకుండా సీబీఎస్ఈ, ఐబీఐసీఎస్ఈ, ఐజీసీఎస్ఈ వంటి పేర్లతో నూతన కర్యూలమ్ పేరుతో లక్షలాది రూపాయలు ఫీజులు దండుకుంటున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షులు మధుసూదన్, వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు, డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనగంటి వెంకటేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పరిషత్ చైర్మన్‌కు సన్మానం

చిక్కడపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్‌ను టీపీసీసీ క్రిష్టియన్ సెల్ ఇన్‌చార్జి ఎస్తేర్‌రాణి సన్మానించారు. శుక్రవారం రియాజ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి శాలువా, పూలమాలతో సన్మానించారు. ఎస్తేర్‌రాణి మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రంథాలయాలకు పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. యువజన కాంగ్రెస్ నేత రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్, పరేడ్ గ్రౌండ్ పరిసరాల్లో..

ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్ సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రావతరణ వేడుకల సందర్భంగా ట్యాంక్‌బండ్, పరేడ్‌గ్రౌండ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలుంటాయని సీపీ కె.శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ట్యాంక్‌బండ్‌పై శనివారం ఉదయం నుంచి ఆదివారం రాత్రి 12 గంటల వరకు, గన్‌పార్క్ వద్ద ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు, పరేడ్‌గ్రౌండ్ పరిసరాల్లో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వాహనాల రాకపోకలపై ఆంక్షలుంటాయని తెలిపారు.

● **ట్యాంక్ బండ్ పరిసరాల్లో..**

అప్పర్ ట్యాంక్‌బండ్‌పై శనివారం ఉదయం 6 గంటల నుంచి జూన్ 2 రాత్రి 12 గంటల వరకు వాహనాల రాకపోకలపై ఆంక్షలుంటాయి. నల్లగుట్ట జంక్షన్ నుంచి నెక్లెస్ రోటరీ వైపునకు వచ్చేవాహనాలను రాణిగంజ్ వైపునకు మళ్లిస్తారు. రాణిగంజ్ నుంచి నెక్లెస్ రోటరీ వైపునకు వచ్చే వాహనాలను మినిస్టర్ రోడ్ వైపునకు మళ్లిస్తారు. వీవీ స్టాచ్యూ వైపు నుంచి నెక్లెస్ రోటరీ వైపునకు వచ్చే వాహనాలను నల్లగుట్ట వైపునకు పంపుతారు. పాత సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ వైపు నుంచి వచ్చేవాహనాలను రవీంద్రభారతి వైపునకు మళ్లిస్తారు. ఇక్బాల్ మినార్ వైపునుంచి వచ్చే వాహనాలను తెలుగుతల్లి ఫ్లైఓవర్ మీదుగా స్టీల్‌బ్రిడ్జి వైపునకు పంపుతారు.

లిబర్టీ, బషీర్‌బాగ్ వైపునుంచి వచ్చేవాహనాలను అంబేడ్కర్ విగ్రహం నుంచి తెలుగుతల్లి ఫ్లైఓవర్ వైపునకు మళ్లిస్తారు. బండమైసమ్మ క్రాస్‌రోడ్ నుంచి వచ్చేవాహనాలను ఇందిరాపార్క్ వైపునకు పంపుతారు. కవాడిగూడ వైపునుంచి వచ్చేవాహనాలను బైబిల్ హౌస్, డీబీఆర్ మిల్స్ వైపునకు పంపుతారు.

● **గన్‌పార్క్ పరిసరాల్లో..**

సైఫాబాద్ పాత పోలీస్‌స్టేషన్, రవీంద్రభారతి జంక్షన్ నుంచి వచ్చే వాహనాలను నాంపల్లి టి జంక్షన్ వైపు అనుమతించరు. నాంపల్లి టి జంక్షన్ వైపు నుంచి వచ్చే వాహనాలను ఏఆర్ పెట్రోల్ పంప్ మీదుగా బీజేఆర్ విగ్రహం వైపునకు పంపుతారు. రవీంద్రభారతి, ఏఆర్ పెట్రోల్ బంక్ జంక్షన్‌ల వద్ద భారీగా ట్రాఫిక్ ఉండే అవకాశముంది.



పరేడ్ గ్రౌండ్, ట్యాంక్ బండ్ వద్ద ఆంక్షలను సూచించే మ్యాప్‌లు

● **పరేడ్ గ్రౌండ్స్ పరిసరాల్లో..**

బేగంపేట వైపునుంచి సికింద్రాబాద్ వైపునకు వచ్చే వాహనాలను సీటీఓ, తివోలీ, వైఎంసీఏ, సంగీత్ క్రాస్ రోడ్స్ వైపునకు పంపుతారు. బేగంపేట నుంచి కార్ఖానా వైపునకు వెళ్లే వాహనాలను పాట్నీ, వైఎంసీఏ వైపునకు మళ్లిస్తారు. ఆర్‌పీ రోడ్ వైపునుంచి తిరుమలగిరి వైపు వెళ్లే వాహనాలను ప్యాట్నీ, క్లాక్ టవర్, వైఎంసీఏ వైపు పంపుతారు. సంగీత్ నుంచి బేగంపేట వైపునకు వచ్చే వాహనాలను క్లాక్ టవర్, ప్యారడైజ్ మీదుగా రసూల్‌పురా దారికి పంపుతారు. ఆలుగడ్డబావి వైపు నుంచి తాడ్‌బండ్, బోయినపల్లి వైపు వెళ్లేవాహనాలను సీటీఓ, రాణిగంజ్ వైపునకు పంపుతారు. బోయిపల్లి వైపు నుంచి తివోలీ వైపు వచ్చే వాహనాలను సీటీఓ వైపునకు పంపుతారు. కార్ఖానా, జేబీఎస్, తిరుమలగిరి వైపు నుంచి ప్యాట్నీ వైపునకు వెళ్లే వాహనాలను స్వీకార్ ఉపకార్, వైఎంసీఏ, క్లాక్‌టవర్ వైపునకు పంపుతారు. తివోలి క్రాస్‌రోడ్స్ ప్లాజా క్రాస్‌రోడ్స్ నుంచి పరేడ్ గ్రౌండ్‌కు వెళ్లే దారిని మూసివేస్తారు. ఆయా రూట్లలో ప్రయాణించే వాహనదారులు ఈ ఆంక్షలను దృష్టిలో ఉంచుకొని, ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించి రద్దీని నివారించాలని సీపీ విజ్ఞప్తి చేశారు.

గ్రూప్-1, 2 పోస్టులను భర్తీ చేయాలి

● ఎంపీ ఆర్. కృష్ణయ్య

రాంనగర్, మే 31 (ఆంధ్రజ్యోతి): డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోటా క్రింద గ్రూప్-1 సర్వీస్‌లో 50 శాతం పోస్టులను ప్రభుత్వ శాఖ పూర్తిస్థాయిలో డైరెక్టుగా లెక్కించి భర్తీ చేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. గ్రూప్-2 సర్వీస్‌లో 30 శాతం నుంచి 40 శాతం పోస్టులు లెక్కించి భర్తీ చేయాలన్నారు. ఈ మేరకు శుక్రవారం టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ మహేందర్‌రెడ్డికి బీసీ సంక్షేమం నాయకులతో ఎంపీ ఆర్. కృష్ణయ్య ఈ అంశంపై చర్చించి వినతిపత్రం సమర్పించారు. అనంతరం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఆర్.కృష్ణయ్య విలేకరులతో మాట్లాడుతూ కొత్త జిల్లాలకు పోస్టులు మంజూరు చేసి ఆప్షన్ పద్ధతి, వెయిటింగ్ లిస్టు పద్ధతి అమలు చేయాలన్నారు. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోటా క్రింద భర్తీ చేయాల్సిన గ్రూప్ 1, 2, 3, 4 సర్వీస్ ఉద్యోగాలను సరిగ్గా పూర్తి స్థాయిలో లెక్కించి గణన చేసి భర్తీ చేయడానికి ప్రతిపాదనలు కొంత మంది ప్రభుత్వ అధికారులు పంపించలేదన్నారు. గ్రూప్- 1 సర్వీస్ కింద గత పదేళ్లలో పోస్టుల భర్తీ చేయలేదని, గ్రూప్-2 సర్వీస్ కింద 6 ఏళ్లల్లో నోటిఫికేషన్ లేదన్నారు. గత పదేళ్లల్లో గ్రూప్-1, గ్రూప్-2 పోస్టులలో ఎంత మంది రిటైర్డ్ అయ్యారు, ఎంతమందికి ప్రమోషన్లు ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ 23 జిల్లాలో 40 శాఖల జిల్లా ఆఫీసులు, తాలుకా ఆఫీసులు ఏర్పడ్డాయని, అలాగే 131 మండలాలు, 30 రెవెన్యూ డివిజన్ ఆఫీసులు, 76 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 25 డీసీపీ ఆఫీసులు, 31 పోలీస్ సర్కిల్స్ 7 పోలీసు కమిషనరేట్లు, 4,383 గ్రామ పంచాయతీలు కొత్తగా ఏర్పడ్డాయని ఆయన గుర్తు చేశారు. దీంతో గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-4 సర్వీసు పోస్టులు పెద్ద ఎత్తున ఏర్పడ్డాయని, అయితే పోస్టులు మంజూరు చేయడం లేదన్నారు. ఇందులో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోటా లెక్కించి వాటిలో గ్రూప్-1లో 150 శాతం, గ్రూప్-2 లో 30 నుంచి 40 శాతం పోస్టులు భర్తీ చేయాలన్నారు. గ్రూప్-4 సర్వీస్ జూనియర్ అసిస్టెంట్ పోస్టులు 25 ఏళ్లుగా పోస్టులు భర్తీ చేయడం లేదన్నారు. యువతను పాలనరంగంలోకి తీసుకువస్తే ఉత్సాహంతో, అంకితభావంతో నిజాయితీగా పనిచేస్తారని ఆయన పేర్కొన్నారు. ఒకే దఫా 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేయడం గొప్ప విషయమన్నారు. తాము సమర్పించిన ఈ అంశాలపై పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చాని ఆర్. కృష్ణయ్య తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నాయకులు నీల వెంకటేష్, గొరిగే మల్లేష్‌యాదవ్, వేముల రామకృష్ణ, కోట్ల శ్రీనివాస్, నంద గోపాల్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.


టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ మహేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పిస్తున్న ఎంపీ ఆర్. కృష్ణయ్య, బీసీ సంక్షేమ సంఘం నేతలు

నడిరోడ్డుపై కుంగిన డ్రైనేజీ మ్యాన్‌హోల్

● ఇళ్లలోకి డ్రైనేజీ మురుగు

ముషీరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ పద్మశాలి కాలనీ ప్రధాన రోడ్డులో మూడు రోజుల క్రితం డ్రైనేజీ మ్యాన్‌హోల్ కుంగిపోవడంతో స్థానికంగా డ్రైనేజీ మురుగునీరు ఇళ్లలోకి వచ్చి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడు ఉమాకాంత్, ఎమ్మెల్యే ముఠాగోపాల్‌కు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను వివరించడంతో జలమండలి ఉన్నతాధికారులు యుద్ధ ప్రాతిపాధికన చర్యలు తీసుకున్నారు. శుక్రవారం పద్మశాలి కాలనీలోని 1-3-176/4/సి/12 ఇంటి సమీపంలో డ్రైనేజీ మ్యాన్‌హోల్ కుంగిపోయి మ్యాన్‌హోల్ పూర్తిగా మట్టితో నిండిపోయింది. దీంతో డ్రైనేజీ మురుగునీరు వెళ్లేందుకు దారి లేకపోవడంతో ఇళ్లలోకి మురుగునీరు రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

జలమండలి జనరల్ మేనేజర్ రామకృష్ణ, డీజీఎం కార్తీక్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకొని యంత్రాల సహాయంతో కుంగిన మ్యాన్‌హోల్ వద్ద తవ్వకాలు చేపట్టి కొత్త పైప్‌లైన్ వేశారు. దీంతో స్థానికంగా ఉన్న డ్రైనేజీ సమస్య పరిష్కారం అయింది. ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ సమస్య పరిష్కారాని సహకరించిన ఉమాకాంత్, జీఎం, డీజీఎం, సెక్షన్ మేనేజర్ ప్రసాద్ బాబులను పూలమాలలు వేసి సత్కరించారు.


పద్మశాలి కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జలమండలి జీఎం రామకృష్ణ, డీజీఎం కార్తీక్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఉమాకాంత్

చరిత్ర సృష్టించిన ఎన్టీఆర్


నివాళులర్పిస్తున్న మాణిక్, జనార్దనమూర్తి

చిక్కడపల్లి, మే 31(ఆంధ్రజ్యోతి): ఎన్టీరామారావు తెలుగుజాతికి గుర్తింపు తెచ్చారని మా కార్యవర్గ సభ్యులు, నటుడు మాణిక్ అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఎందరో మహానుభావుల మధురస్మృతులలో భాగంగా నందమూరి తారకరామారావు 101వ జయంతి నిర్వహించారు. ఆయన నటుడుగా రాజకీయవేత్తగా చరిత్ర సృష్టించారన్నారు.


ములగలేటి గోపాలకృష్ణను సన్మానిస్తున్న జస్టిస్ నాగమారుతి శర్మ

లలితసంగీత కళానిధి ములగలేటి

చిక్కడపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): లలితసంగీతంలో పలు ప్రయోగాలు చేసి వందలాది మంది శిష్యులను కలిగిన ములగలేటి గోపాలకృష్ణ లలిత సంగీత కళానిధి అని సీబీఐ కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతి శర్మ అన్నారు. భారతి మ్యూజిక్ అకాడమీ 24వ వార్షికోత్సవం శుక్రవారం రాత్రి త్యాగరాయగానసభలో జరిగింది. గోపాలకృష్ణకు భారతి జీవన సాఫల్య పురస్కారం, లలిత సంగీత భారతి బిరుదును బహూకరించిన నాగమారుతి శర్మ మాట్లాడుతూ సంగీత సాధన వల్ల మానసిక రుగ్మతలు తొలగిపోతాయన్నారు. తిరుమల గ్రూప్ అధినేత చంద్రశేఖర్, నిర్మాత లక్ష్మణరేఖ గోపాలకృష్ణ, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, నిర్వాహకులు చింతలపాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ దొంగల ముఠా అరెస్ట్

● వీరిలో ఇద్దరు మైనర్లు

● కత్తులు, సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనాలు స్వాధీనం

బౌద్ధనగర్, మే 31 (ఆంధ్రజ్యోతి): దోపిడీ దొంగల ముఠాను చిలకలగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రెండు కత్తులు, రెండు ద్విచక్రవాహనాలు, రెండు సెల్‌ఫోన్‌లు, వెయ్యిరూపాయలు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్‌రావు, చిలకలగూడ డివిజన్ ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అనుదీప్ వివరాలు వెల్లడించారు. మే 29వ తేదీ రాత్రి తొమ్మిది గంటల సమయంలో మహ్మద్‌గూడ అక్బర్ హోటల్ వద్ద పద్మారావునగర్‌కు చెందిన విద్యార్థులు గౌతమ్, రాజకుమార్‌తో పాటు మరో యువకుడు యువతి చదువు విషయంపై మాట్లాడుకుంటున్నారు. అక్కడకు వచ్చిన దోపిడీ దొంగల ముఠా సభ్యులు మహ్మద్ రహీమ్ బేగ్ అలియాస్ రహీమ్, మహ్మద్ షేక్ హుస్సేన్ అలియాస్ సోను, మహ్మద్ సమీర్, సయ్యద్ అహ్మద్ పాషా అలియాస్ అఫీర్, మహ్మద్ వాసిదుద్దీన్‌తోపాటు మరో ఇద్దరు మైనర్లు వారితో వాగ్వాదానికి దిగారు. విద్యార్థులు పరుగు తీయగా దోపిడీ దొంగల ముఠా సభ్యులు వారిన వెంబడించారు. మైనర్ కర్రతో వారిని కొట్టిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. రాజ్‌కుమార్ అనే యువకుడి వద్ద సెల్‌ఫోన్, వెయ్యిరూపాయలు లాక్కున్నారు. ఎవరికైనా చెబితే చంపుతామని దోపిడీ దొంగలు బెదిరించారు. గౌతమ్ అదేరోజు రాత్రి చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గాయపడిన గౌతమ్‌ను పోలీసులు చికిత్స నిమిత్తంగా గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు దాడి దృశ్యాల సీసీ ఫుటేజీలను పరిశీలించారు. గురువారం రాత్రి వారాసిగూడ చౌరస్తాలో ఐదుగురు యువకులను, ఇద్దరు మైనర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో యువకుడు పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. మహ్మద్ రహీమ్ బేగ్‌కు నేరచరిత్ర ఉందని, మైనర్‌గా ఉన్నప్పుడే ఫైజల్ అనే యువకుడి హత్య కేసులో నిందితుడని డీసీపీ తెలిపారు. కేసును ఛేదించిన పోలీసు సిబ్బందికి రివార్డు అందజేస్తామని డీసీపీ చెప్పారు.


స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు, కత్తులు, సెల్‌ఫోన్లను చూపిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ గిరిధర్‌రావు, ఏసీపీ జైపాల్‌రెడ్డి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్, హైదరాబాద్ సిటీ-1 పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈలు విజయభాస్కర్, ప్రేమానంద్‌పాయ్ తెలిపారు. శివం 11 కేవీ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి 12 వరకు, డీడీ కాలనీ పరిధిలో 11.30 నుంచి 1.00, అయ్యప్పటెంపుల్ పరిధిలో 2.30 నుంచి 4.30, రెడ్‌బిల్డింగ్ పరిధిలో 3 నుంచి 4.30, గాంధీనగర్ పరిధిలోని విష్ణురెసిడెన్సీ, దేవీచౌక్ తదితర ప్రాంతాల్లో 10.30 నుంచి 1, సిటీ సెంట్రల్ లైబ్రరీ పరిధిలోని సుధాహోటల్ ఏరియా, బాపునగర్, వివేక్‌నగర్ తదితర ప్రాంతాల్లో 2.00 నుంచి 4.30 వరకు సరఫరా ఉండదన్నారు.

కలుషిత నీటి సమస్యకు పరిష్కారం


పనులను పరిశీలిస్తున్న శ్రీధర్‌రెడ్డి, దీన్‌దయాల్‌రెడ్డి

ముషీరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ బాపూజీ నగర్‌లో డ్రైనేజీ, మంచినీరు పైప్‌లైన్ లీకేజీతో కలుషి నీటి సమస్య ఏర్పడడంతో శుక్రవారం జలమండలి అధికారులు పనులు చేపట్టారు. కలుషిత నీటికి కారణమైన చోట తవ్వకాలు చేపట్టి కొత్త పైప్‌లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. పనులను ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దీన్‌దయాల్‌రెడ్డి, ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, ముషీరాబాద్ మహంకాళి దేవాలయ కమిటీ చైర్మన్ ఎయిర్‌టెల్ రాజు పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మంచినీటిని అందించాలని వారు అధికారులను కోరారు.

ట్రెటా ఉపాధ్యక్షుడిగా డేవిడ్ ఫ్రాన్సిస్


డేవిడ్ ఫ్రాన్సిస్

చిక్కడపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ ఎంప్లాయీస్ టీచర్స్ అసోసియేషన్ (ట్రెటా) ఉపాధ్యక్షుడిగా చిక్కడపల్లికి చెందిన ఎం.ఏ. డేవిడ్ ఫ్రాన్సిస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం నగరంలోని అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా పి.వెంకటయ్య, కోశాధికారిగా నరసింహ ఎన్నికయ్యారు. డేవిడ్ ఫ్రాన్సిస్ సమాచార హక్కు చట్టం ద్వారా అసోసియేషన్‌కు సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించడంలో ఎంతో కృషి చేశారు. డేవిడ్ ఫ్రాన్సిస్ ఎందరో క్రీడాకారులకు ఆదర్శనీయుడు. ఆయనకు ప్రముఖుల పేరిట అవార్డులు, రాష్ట్ర, జాతీయ క్రీడల్లో బంగారు పతకాలు అందుకున్నారు. కాగా డేవిడ్ ఫ్రాన్సిస్ ఎన్నికపై హర్షం వ్యక్తం చేస్తూ నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రముఖులు, ఆయన అభిమానులు, క్రీడాకారులు ఆయనను అభినందించారు.


కేక్ కట్‌చేస్తున్న కృష్ణ అభిమానులు

సూపర్‌స్టార్ కృష్ణ ఫ్యాన్స్ అన్నదానం

చిక్కడపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు సూపర్‌స్టార్ కృష్ణ జయంతిని శుక్రవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సుదర్శన్ 35 ఎంఎం థియేటర్‌లో అభిమానులు ఘనంగా నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ దిడ్డిరాంబాబు, థియేటర్ ఓనర్స్ విశ్వంభర, బాలు, మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, ధన్‌రాజ్ యాదవ్, ఆలిండియా సూపర్‌స్టార్ కృష్ణ మహేష్‌సేన అభిమానుల ఆధ్వర్యంలో కేక్ కట్‌చేశారు. అనంతరం దాదాపు 300 మందికి బిర్యాని పంపిణీ చేశారు. దిడ్డిరాంబాబు మాట్లాడుతూ హీరో కృష్ణ సేవకు మారుపేరుగా నిలిచారని ఆయన స్ఫూర్తిగా తాము సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం నేతలు మల్లేష్, రాజిరెడ్డి, వెంకటేష్‌యాదవ్, సాయికుమార్, యశ్వంత్ పాల్గొన్నారు.



ఇందిరాపార్కు వద్ద నిర్వహించిన మహాధర్నాకు బర్కత్‌పురాలోని బీజేపీ నగర కార్యాలయం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు ర్యాలీగా తరలివెళ్లారు. సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ఎన్ గౌతమ్ రావు సారధ్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కన్నె ఉమాదేవి, అమృత, బీజేపీ నేతలు కన్నె రమేష్‌యాదవ్, నందకిషోర్‌యాదవ్ పాల్గొన్నారు. -బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి

